రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడు

- సామాన్యుడిపై మోయలేని భారం
- రియల్ ఎస్టేట్ ఢమాల్
- అమ్మకాలు, కొనుగోళ్ల పతనంతో రాబడికి గండి



కడప రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న భూ క్రయవిక్రయదారులు (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ ఇంత వరకు అమలు చేయని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై మాత్రం మోయలేని భారాలు వేస్తోంది. విద్యుత్ చార్జీల పెంపు షాక్ నుంచి ప్రజలు కోలుకోకముందే.. రిజిస్ట్రేషన్ చార్జీల మోత మోగిస్తోంది. స్థిరాస్తి వ్యాపారం పడిపోయిన పరిస్థితుల్లో భూముల విలువలు అశాస్త్రీయంగా పెంచి రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తోంది. జిల్లాలో ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 400 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పటికే 30 శాతం ఆదాయం తగ్గిందని, రిజిస్ట్రేషన్ చార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెంచడం ద్వారా లావాదేవీలు తగ్గిపోయి ఆదాయం మరింత పడిపోయే అవకాశం ఉందని వివిధ వర్గాలు అంటున్నాయి.

ఆనవాయితీగా విరుద్ధంగా..

భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ ఏప్రిల్ 1 నుంచి లేదా సెప్టెంబరు 1 నుంచి చేపట్టడం 1987 నుంచి ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ యేడు ఫిబ్రవరి నుంచే ప్రభుత్వం బాదుడు మొదలు పెట్టడం అసంబద్ధమని ప్రజలు వాపోతున్నారు. జిల్లాలో ఆయా సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు జాయింట్ కలెక్టర్ అధ్వర్యంలో ఆస్తుల విలువ నిర్ధారించడం పరిపాటి. ఆయా ప్రాంతాల్లో అప్పటిదాకా జరిగిన క్రయవిక్రయాల్లో ఎక్కువ విలువ ఏదైతే ఉంటుందో దాన్ని పరిగణనలోకి తీసుకుని మార్కెట్ వాల్యూ నిర్ణయిస్తారు. రూరల్, అర్బన్, రెసిడెన్సియల్, కమర్షియల్ ప్రాంతాల్లో ఒక్కో చోట ఒక్కో విలువ ఉండడం సహజం. అంటే ఒక్కో ప్రాంతాన్ని బట్టి భూములను క్లాసిఫికేషన్ చేసి విలువలు నిర్ధారించడం జరిగేది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం ప్రాంతాన్ని అనుసరించి కాకుండా ఒకే ప్రాంతంలో రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం, విల్లాలు ఉన్నచోటు, ఇంకొంచెం లోపల ఉన్న స్థలాలకు ఒక్కో రేటు నిర్ణయించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కడపలో..

కడప రూరల్, అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు 10 నుంచి 15 శాతం మాత్రమే పెంచామని అధికారులు చెబుతున్నా వాస్తవం మాత్రం అందుకు పూర్తి విభిన్నంగా ఉంది. కడప నగరంలో ప్రధాన రహదారుల పక్కన విల్లాలు ఉన్న చోట 35 శాతం చార్జీలు పెరిగాయి. ప్రధాన రహదారులకు కొంత లోపల ఉన్న ప్రదేశాల్లో 10–20 శాతం పెంచాల్సి ఉండగా, రౌండ్ ఫిగర్ పేరిట అధికారులు దానిని 25 శాతానికి పెంచారని తెలుస్తోంది. కడప నగరం విశ్వనాథపురంలో గజంపై ఇప్పటి దాకా రూ. 5200 ఉండగా, 35 శాతం చార్జీలు పెంచడం వల్ల అది రూ. 7 వేలకు చేరింది. అంటే గజం స్థలంపై రూ.1800 పెంచారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన చిన్నమాచుపల్లెలో 20 శాతం పెంచారు. దీంతో ఇప్పటి దాకా రూ.16 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ ఒక్కసారిగా రూ. 20 లక్షలకు పెరిగిందని చెబుతున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో ఉన్న వెంచర్లకే కాకుండా వాటి పక్క నుంచే వ్యవసాయ భూముల విలువలు కూడా అమాంతం పెంచి వేయడం వల్ల రైతులు కూడా నష్టపోవాల్సి వస్తోంది.

భూమిని వ్యవసాయేతర అవసరాలకు..

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే సందర్భంలో మార్కెట్ విలువలో పది శాతం ల్యాండ్ కన్వర్షన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. అలాగే రహదారుల విస్తీర్ణంపై కూడా వెంచర్లు వేసే వారిపై భారం పడుతుందంటున్నారు. రూ. లక్షకు రూ.540 చొప్పున వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ మూడు సంవత్సరాల కాలానికి చెల్లించాలి. ఇందులో మార్కెట్ వాల్యూ, డాక్యుమెంట్ వ్యాల్యూలో ఏది ఎక్కువగా ఉంటే దాని ఆధారంగా వీఎల్‌టీ చెల్లించాలి. అప్పుడే మున్సిపల్ అధికారులు ప్లాన్ అప్రూవల్ చేస్తారు. మొత్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇంటి స్థలం కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇంటి నిర్మాణాలు చేపట్టలేని దుస్థితి ఏర్పడనుంది. ఏదైనా అవసరాలు, వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, ఇళ్లు విక్రయించుకోవాలనుకునే వారు రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వల్ల ఆ మేరకు నష్టపోవాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల మొత్తంగా క్రయ విక్రయాలు తగ్గిపోయి ఆదాయానికి కూడా పెద్ద ఎత్తున గండిపడనుందని విశ్లేషిస్తున్నారు.

సామాన్యుడిపై భారం



రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సామాన్యుడిపై మోయలేని భారం పడింది. చార్జీలు పెంచడం వల్ల అమ్మకాలు, కొనుగోళ్లు మందగిస్తాయి. ఎవరైనా రిజిష్టర్ అగ్రిమెంట్లు కుదుర్చుకున్నప్పటికీ భవిష్యత్తులో అవి వివాదాలకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడం కోసం సామాన్యులపై ఇలా భారాలపై భారాలు వేయడం క్షంతవ్యం కాదు.

– ఎస్.రవిశంకర్‌రెడ్డి, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి దెబ్బ



ఇప్పటికే రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం కుదేలై ఉన్నాయి. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వల్ల అవి మరింత కుంటుపడే అవకాశం ఉంది. ఇందువల్ల భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పనులు తగ్గిపోతాయి. పైసాపైసా కూడబెట్టుకుని ఇంటి స్థలం కొనుగోలు చేయాలనుకునే మధ్య తరగతి ప్రజల ఆశలు అడియాశలు కానున్నాయి. ప్రభుత్వ నిర్ణయం అన్నిరంగాలపై ప్రభావం చూపి సంక్షోభం మరింత పెరిగే అవకాశం ఉంది.

– ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

లూర్దుమాత దీవెనలు పొందాలి



దైవ సందేశం అందజేస్తున్న గురువులు

- ఘనంగా పతాకావిష్కరణ
- ప్రారంభమైన నవదిన ఉత్సవాలు

కడప కల్చరల్ : ప్రతి ఒక్కరూ లూర్దుమాత దీవెనలు పొందుతూ సుఖ సంతోషాలు, భక్తితో జీవితాన్ని గడపాలని నెల్లూరు పీఠాధిపతులు రైట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం తెలిపారు. నగరంలోని మరియాపురంలోని పాత చర్చి వద్ద ఈ నెల 10,11 తేదీల్లో జరుగనున్న లూర్దుమాత నవదిన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశ్వాసులు మత పెద్దలతో కలిసి ఊరేగింపుగా కార్యక్రమ వేదిక వద్దకు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పతాకాన్ని ఆవిష్కరించి తిరునాల మహోత్సవాలను ప్రారంభించారు. పీఠాధిపతులు రైట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం దివ్య బలి పూజ నిర్వహించి ప్రసంగించారు. కథోలిక సాంప్రదాయంలో మరియమాతకు విశిష్ట స్థానం ఉందని, ఆమెను అనేక పేర్లతో కీర్తిస్తారని తెలిపారు. ఆ తల్లి పేరిట ఎన్నో పండుగలు, ఉత్సవాలు జరుపుకొంటారని, అందులో భాగంగా మరియాపురంలో వెలసిన ఈ తల్లిని లూర్దుమాత అని కొలుస్తారని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ప్రజలు, విశ్వాసులు పాల్గొని తల్లి దీవెనలు పొందాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు రైట్ రెవరెండ్ ఫాదర్ ఈరి మరియన్న, సహాయక గురువులు ఫాదర్ జంపంగి సుధాకర్, తిరునాల కమిటీ ప్రతినిధులు జ్యోతి రాయప్ప, బాలశౌరి, పెండ్లిమర్రి ప్రదీప్, యన్నం ఆనంద్, కల్లూరి ప్రసాద్‌తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఆశా కార్యకర్తల అక్రమ బదిలీలు, రాజకీయ నాయకుల, అధికారుల వేధింపులు, బెదిరింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఆదివారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు బదిలీల నిబంధనలు లేవని వారు వారి గ్రామ పరిధిలో ఉన్న జనాభాకు పని చేయాల్సి ఉందన్నారు. రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం ఆశాలను తొలగించాలని తప్పుడు ఫిర్యాదులు ఇవ్వడం జరుగుతోందన్నారు. చిరుద్యోగుల పైన కూటమి ప్రభుత్వ నేతలు వేధించడం, అక్రమ బదిలీలు చేయడం సరైన చర్య కాదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజకీయ నాయకుల ఒత్తిడిలు, తప్పుడు ఫిర్యాదులను పరిగణలోనికి తీసుకొని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తపేట ఆశా వర్కర్ కాశీ రత్నమ్మను అక్రమ బదిలీ చేసి అక్కడ జాయిన్ కాకపోతే ఉద్యోగం నుంచి తీసివేస్తామని బెదిరించటం జరిగిందన్నారు. కాశీరత్నమ్మకు తన శరీరంలోని అవయవాలలోని ప్రధానమైన కిడ్నీ ఒకటి పుట్టుకతో లేకపోవడం, దాని ద్వారా అనారోగ్యంతో ఉన్న ఆమె తన జనాభా పరిధిలో పని చేస్తానని వేడుకున్నారని తెలిపారు. వేరే దగ్గరకు పోయి పని చేయడానికి ఆరోగ్యం సరిగా లేనందున ఇబ్బంది పడతానని చెప్పి ఏడ్చి మొత్తుకున్నా వినిపించుకోకుండా అధికారులు ఆమెపై ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాశీ రత్నమ్మను ఉద్యోగం నుంచి తొలగించాలని మైదుకూరు ఎమ్మెల్యే సిఫారసు చేశారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలియజేయడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఏ- గ్రేడ్ సాధించామని చెప్పుకునే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అందుకు కృషి చేసిన ఆశా కార్యకర్తలను రాజకీయ నాయకుల మెప్పు కోసం తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సహించరానిదని అన్నారు. తక్షణమే అక్రమ బదిలీలు, వేధింపులు ఆపాలని, ఆశాలకు అధికారులు ఇచ్చిన మెమోలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆశాల నియామకపు నిబంధనల ప్రకారం వారి ప్రాంతాలలో వారిని తిరిగి డ్యూటీలకు పంపాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మరియమ్మ, కల్పన, జిల్లా కోశాధికారి సి.అమ్ములు, బాల కుళాయమ్మ, యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, జయమ్మ, కాశీ రత్నమ్మ ఆశాలు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో తెలుగు మాధ్యమం కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని, అందుకు అవసరమైన అదనపు టీచర్ పోస్టులను మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏపీటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో 40 మంది విద్యార్థుల వరకు ఒక సెక్షన్, 40 నుంచి 80 మంది విద్యార్థులకు రెండవ సెక్షన్, 80 నుంచి 120 వరకు మూడవ సెక్షన్ కొనసాగించేలా చూడాలన్నారు. అలాగే ప్రతి ఉపాధ్యాయుడికి పీరియడ్ల సంఖ్యను 30కి మించకుండా చూడాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టులు వుండేలా చూడాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తరలించకుండా ప్రాథమిక పాఠశాలల్లోనే 1 నుంచి 5 తరగతులను కొనసాగించాలని అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, ప్రతి ఆదర్శ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో సంఘాల సూచనలను పరిగణనలోనికి తీసుకోవాలన్నారు.సుద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో వున్న రెండు డీఎలను ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లాకార్యదర్శులు మునివర్ధన్ కుమార్, శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు క్రిష్టారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభ వెలికి తీయాలి

కడప ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ప్రతిభా పాటవాలను వెలికి తీసి, వారి నైపుణ్యాలకు పదును పెట్టి తద్వారా సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా ఏకలవ్య ఫౌండేసన్ పని చేస్తోందని గౌరవాధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన సంస్థ గౌరవ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. సుమారు 150 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దాతలకు అతిథులచే మోమెంటోలు అందజేసి సన్మానించారు. అప్పరాజపల్లె చిన్నారులు కోలాటం, లఘు నాటిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ సహాయ సంచాలకులు మునీర్ అహ్మద్, కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి, నాగార్జున కళాశాల డైరెక్టర్ శివవిష్ణు మోహన్‌రెడ్డి, సంస్థ ట్రస్టీ చలపతి, విద్యాకమిటీ చైర్మన్ బాలకృష్ణ, సంస్థ కడప ఇన్‌చార్జి ప్రశాంత్, ప్రాజెక్టు మేనేజర్ ఎన్విత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, సంస్థ బోధకులు, పిల్లలు పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు తీరని అన్యాయం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమకు తీరని అన్యాయం జరిగిందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని సీపీఎం కార్యాలయం ఎదుట ఆదివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో కడప ఉక్కుకు అన్యాయం చేస్తూనే వుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలు కానీ, కడప ఉక్కు కానీ ఊసే లేదన్నారు. ఇది ఇక్కడి ప్రాంత ప్రజానీకాన్ని మోసం చేయడమే అన్నారు. చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడానికి కారణం ఏమిటి అన్నారు. ఉక్కు పరిశ్రమ వస్తే వేల మంది చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని, తద్వారా రాయలసీమలో కరువు నివారణలో యువతకు ఉపాధి లభించి ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, నాయకులు సురేష్, రాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్



మాట్లాడుతున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమకు అన్యాయం జరిగిందని దీంతోపాటు ఈ బడ్జెట్ సామాన్యులకు అందని ద్రాక్ష లాగా వుందని, నిత్యావసరాల ధరలు పెంచి కార్పొరేట్ బడ్జెట్‌గా అవతరించిందని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ వాపోయారు. ఆదివారం కడపలోని ఓం శాంతినగర్ ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం పెరిగిపోతుందని, పేదరిక నిర్మూలనకు కృషి చేయకుండా కార్పొరేట్ శక్తులకు తొత్తుగా వ్యవహరించే బడ్జెట్ అని అన్నారు. రూపాయి విలువ పడిపోయిందని, దేశంలో ఆర్థిక వ్యవస్థ పతనానికి దారి తీసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర బడ్జెట్లో పునర్ విభజన చట్ట ప్రకారం కడప ఉక్కు పరిశ్రమకు కేటాయించాల్సిన నిధులు కేటాయించకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమపై చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కోకన్వీనర్ సుబ్బమ్మ, హిమబిందు, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాయలసీమ కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేతన జీవులకు సాంత్వన

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం, వారికి సాంత్వన కలిగించే విషయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త బడ్జెట్‌పై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉండగా పన్ను రాయితీ ప్రకటన వల్ల వారికి ఎంతో ఉపశమనం లభించిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇతర వ్యయాలకు తోడు వేతనంలో అధిక భాగం పన్ను రూపంలో వారు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఉద్యోగులకు కొంత ఊరటనిస్తోందన్నారు. అదే విధంగా ఉద్యోగుల చిరకాల వాంఛ అయిన సీపీఎస్ రద్దు విషయంపై కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని దేశ వ్యాప్తంగా ఉద్యోగులందరికీ పాత పింఛను పథకం అమలయ్యేలా చర్యలు తీసుకుంటే ఉద్యోగులందరూ ఎంతో రుణపడి ఉంటారని ఆయన పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఆవుకు నట్టల మందు తాపుతున్న పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ

కడప ఎడ్యుకేషన్ : పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలను పాటించాలని పశుసంవర్ధశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. వసంత పంచమి, మాఘమాసంలో భాగంగా ఆదివారం జాతీయ జంతు సంరక్షణ సంస్థ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గోకులంలోని పశువులకు గొంతువాపు, బ్రూసెల్లా వ్యాధి నివారణకు టీకాలు వేశారు. దీంతోపాటు సాధారణ చికిత్సలు, నట్టల మందును తాపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ టివి రమణయ్య, వ్యాధి నిర్ధారణ విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పశు వైద్యాధికారి లీలా స్వర్ణ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కిషోర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సురేష్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ శివ, నరేష్, రఫీతోపాటు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట



విద్యార్థుల నృత్యప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా మిస్పా మూవీ ఆధ్వర్యంలో స్థానిక కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. సందర్శకులు చిన్నారులను పదేపదే తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు. శిల్పారామయం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ మధుసూదన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అంధుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నాజియ టాబుస్సుంను సన్మానిస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం మరియాపురం స్కూల్‌లో నిర్వహిస్తున్న బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా సీనియర్ దేశభక్తి గీతాల పోటీలో కడప అంధుల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో భాగంగా సీనియర్ దేశ భక్తి గీతాల పోటీలో సీనియర్ విభాగంలో నాజియ టాబుస్సుం, జూనియర్ విభాగంలో లక్ష్మి అక్షయ ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం వేపరాల ఎబినేజర్ తెలిపారు. ఈ విద్యార్థులను బాలోత్సవం ప్రతినిధులతోపాటు హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

హెల్మెట్‌పై అవగాహన పెంచుకోవాలి



వాహనదారులకు సూచనలు చేస్తున్న టూటౌన్ సీఐ బి.నాగార్జున

కడప అర్బన్: జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ ధరింపు ప్రాముఖ్యతపై పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. కడప నగరంలోని టూటౌన్ పోలీసులు తమ పరిధిలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టడంతోపాటు హెల్మెట్ ధారణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రాజేశ్వరీదేవికి విశేష పూజలు



వారాహి అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈఓ ఎ.శ్రీధర్, ఆలయ ప్రముఖుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా అమ్మవారికి వారాహి అలంకారం నిర్వహించారు. మూలమూర్తికి ఉదయం విశేష అభిషేకాలు కొనసాగాయి. ఉదయం 4 గంటల నుంచి పూజలు ప్రారంభం కావడంతో తెల్లవారుజామునే భక్తుల సందడి పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి సామూహికంగా కుంకుమార్చన, ఇతర పూజలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సోమవారం కూడా ఈ పూజోత్సవాలు నిర్వహించనున్నారు.

వైద్య సేవ ఎంతో గొప్పది



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి

కడప అర్బన్ : వైద్య సేవ గొప్ప సేవయని, డాక్టర్స్‌గా సమాజానికి మనం ఎంతో రుణపడి వున్నామని పేద ప్రజలకు సేవలందినప్పుడే డాక్టర్ వృత్తికి సార్థకత వుంటుందని ప్రముఖ వైద్యులు, జన విజ్ఞానవేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. కడప రిమ్స్‌లో వైద్య విద్యార్థుల కోసం ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎ.ఎస్ ఫరూక్ ఏర్పాటు చేసిన 'వైద్య వృత్తి – ప్రాముఖ్యత- బాధ్యత' అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా జనవిజ్ఞాన వేదిక, కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడారు. వైద్య వృత్తి చాలా కీలకమైన వృత్తిని, మంచి ఉత్తమ ఫలితాలతో వైద్య వృత్తిలో సీట్లు పొందడం అభినందనీయమని, ఐతే తమ లక్ష్యం పేదలందరికీ వైద్య సేవలు అందించే విధంగా వుండాలనీ, వైద్యం ఖరీదై పోయిన నేట పరిస్థితులలో వైద్య సేవలు సమాజంలో అందరికీ అందుబాటులోకి తేవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు, జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ రాంగోపాల్ వర్మ, ఈ.ఎన్.టి వైద్యులు డాక్టర్ ఫరూక్, జనవిజ్ఞానవేదిక జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్‌లు మాట్లాడుతూ ఉత్తమ పౌరసమాజం కోసం మనమంతా కలిసి కృషి చేయాలనీ, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. మంచి మానవసంబంధాలతోనే మంచి భవిష్యత్తు వుంటుందనీ పేర్కొన్నారు. చివరిలో ప్రముఖ జనవిజ్ఞాన వేదిక మెజీషియన్ హరేరామ్ ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి సనావుల్లా, నాయకులు మంజూరు బాషా, రాంబాబు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు



చిన్నారులతో అవోపా మహిళా విభాగ్ ప్రతినిధులు

కడప కల్చరల్ : వసంత పంచమి ఘడియలు ప్రారంభం సందర్భంగా కడప అవోపా మహిళా విభాగ్ స్థానిక సరస్వతి బాల శిశు మందిరంలో ఆదివారం సరస్వతిదేవికి పూజ చేసి చిన్నారులకు స్కూల్ బ్యాగులు, పలకలు, క్రెయోన్స్, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు వంకదారి చంద్ర శేఖర్, బొగ్గరపు బాలకృష్ణ, శివ వరప్రసాద్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆవోపా స్టేట్ అడ్వైజర్ ముచెర్ల వెంకట సుబ్బయ్య, సత్య ప్రసాద్, జిల్లా కార్యదర్శి కర్నాటి సురేష్, చొప్పారపు సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు సాదు జనార్ధనరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మహిళా విభాగ్ గౌరవ అధ్యక్షురాలు చప్పరపు పుష్పాంజలి, అధ్యక్షురాలు సాదు కృష్ణవేణి, కార్యదర్శి సుప్రియ, రెడ్డిలక్ష్మి , మధులత, కల్పనలు పర్యవేక్షించారు.